# సింగిల్ పేజీ కథలు

## ఆదర్శం

"ఉదయం పదిగంటలకి కదా మీ ఆఫీస్? వాకబుల్ డిస్టెన్సే అయినా మరీ ఇంత తొందరగా ఎనిమిది గంటలకే బయల్దేరి వెళ్లిపోవాలా? ఏమిటండీ ఈ చోద్యం? కాస్త టిఫిన్ చేసి వెళ్లొచ్చుగా. వట్టి కాఫీనీళ్లు తాగేసి వెళ్లిపోతారు. మధ్యాహ్నం లంచ్‌కి సుమారుగా రెండున్నర గంటల దాకా టైముంటుంది. అయినా క్యారేజీ పట్టుకుపోతారు. కనుచూపు దూరంలోనే మీ ఆఫీసుంది. ఏమిటండీ ఈ చోద్యం?"

భార్య శ్రీలక్ష్మికి చిరునవ్వుకు బదులిస్తూ "మరి నేను వెళ్లొస్తాను" అంటూ ఆమె అంగీకారాన్ని గ్రహించనంత హడావుడిగా బయల్దేరి వెళ్లిపోయాడు జగన్నాథం.

'ఇది రోజూ ఉన్నదేగా' అని సన్నగా మూల్గుతూ లోపలికి వెళ్లిపోయిందా మహాసాధ్వి.


ఆఫీసు ఐదు గంటలకి అయిపోయినా ఏ రాత్రో ఇంటికి వచ్చేవాడాయన. ఎందుకింత ఆలస్యమయిందని మొదట్లో కొన్నాళ్లడిగినప్పుడు ఏ సమాధానం రాకపోవటంతో "నా నోరు నొప్పెట్టడం తప్ప మీరేం చెప్పరు" అని అతనికి వినపడేలా అనీ అనీ ఆ తర్వాత అడగడం కూడా మానేసుకుంది.

* * *

నా అనేవాళ్లెవరూ లేని జగన్నాథం అనాథశరణాలయంలో పెరిగి పెద్దవాడయ్యాడు. ఎంతో మంది ఉదారస్వభావుల సహాయ సహకారాలతో ఎన్నో అనారోగ్య సమస్యల్ని అధిగమించాడు. దీక్షా పట్టుదలలే పెట్టుబడిగా పెట్టి బ్యాంక్ ఎంప్లాయ్ కాగలిగాడు. పేదింటి అమ్మాయిని చూసి మరీ ఆదర్శ వివాహం చేసుకున్నాడు కూడా. అందుకే జగన్నాథం మహోన్నత వ్యక్తిత్వం ముందు ఆమె ముక్కుసూటిగా తలెత్తి మాట్లాడలేకపోయేది. అయినా పెళ్లయి కాపురం పెట్టిననాటి నుండే తన భర్త ఇంటి కోసం అతి తక్కువ సమయాన్ని కేటాయించడం మాత్రం ఆమె జీర్ణించుకోలేకపోయింది.

ఆరుగురు ఆడపిల్లల్ని కని నూటికి నూరు విధాలుగా ఎన్నో కష్టాలు పడి పెళ్లిళ్లు చేసి అలసిపోయిన తన తల్లిదండ్రుల జీవితాల్లో వసంతవానలు కురిపించి, కట్నాలూ కానుకలూ.. పెట్టుపోతల వంటి వాటి మాటెత్తకుండా పెళ్లి ఖర్చుల సైతం తానే పెట్టుకుని మరీ వివాహమాడిన పెనిమిటి తన పాలిట నిజంగా కనిపించే దైవమే మరి!

"ఐదుగురాడపిల్లల్ని ఎంతో కష్టపడి మెట్టినింటికి పంపేశారు. శ్రీలక్ష్మి చేయందుకునే భాగ్యం నాకు కలిగించారు. ఇక మిగిలేదిక్కడ మీ రెండు పక్షులేగా! నాకూ అమ్మా నాన్నా లేరు. మేం కాపురం పెట్టాక ఇంట్లో పెద్ద దిక్కే లేకుండాపోతుంది. ఆ వెలితిని నింపే శక్తి ఒక్క మీకు మాత్రమే ఉంది. దయచేసి నా మాట కాదనకుండా మీరూ మాతోనే ఉండిపోవాలి" అని జగన్నాథం ఎంతలా వారించినా తన అత్తమామలు ఎంతో ఆత్మాభిమానం కలవారవ్వడంతో "క్ష..మిం..చు..నా..యు..నా" అంటూ చిన్న



వాడైన జగన్నాథంలో ఒక మహా మూర్తి సాక్షాత్కరించడంతో పెద్దోళ్లిద్దరూ చేతులెత్తి దండం పెట్టబోతుంటే.. పాదాభివందనం చేసిన జగన్నాథం-

"మీరెప్పుడైనా ఏ వేళైనా రావచ్చు..పోవచ్చు. ఎన్నాళ్లయినా ఉండొచ్చు. ఏ విషయంలోనైనా మమ్మల్ని శాసించొచ్చు. మీకెప్పుడు ఏ సాయం కావాల్సి వచ్చినా నిర్మొహమాటంగా మమ్మల్ని అడగొచ్చు. నేనింతలా చెప్పినా మొహమాటం అడ్డొస్తే మాత్రం మీ అమ్మాయి చెవిలో వేయండి చాలు. మీ ఆయురారోగ్యాలూ.. ఆశీర్వచనాలే మాకెల్లవేళలా శ్రీరామరక్ష" అంటూ భార్యతో సహా మరోసారి అత్తమామలకు పాదాభివందనం చేసిన సన్నివేశం తన స్మృతిపథంలో కదలాడింది శ్రీలక్ష్మికి. ఆర్ద్రతాభరిత హృదయంతో చెమ్మగిల్లిన కళ్లను పైటకొంగుతో తుడుచుకుంటూ భర్త అడుగు బైట పెట్టడంతో తను లోపలికి వెళ్లిపోయింది.

* * *

దైవం లాంటి భర్తను నిలదీయడానికి తన మనసెంతమాత్రం అంగీకరించకపోయినా సరే "ఏమిటిదంతా? ముందుగానే ఆఫీసు అంటూ వెళ్లిపోతారు. క్యారేజ్ పట్టుకుపోతారే తప్ప లంచ్‌కి రారు. ఏ రాత్రో ఇంటికి వస్తారు. కొత్తగా పెళ్లయినవాళ్లం! హాయిగా ఆనందంగా గడపాల్సిన అమృతఘడియలన్నీ కాలగర్భంలో కలిపేస్తున్నారు. రేప్పొద్దున్న పిల్లాపీచూ అయ్యాక వాళ్ల ఆలనా పాలనా చూస్కోడానికే సమయం సరిపోదు. ఇంక సుఖశాంతులెక్కడ చెప్పండి!? ఇప్పుడు కదండీ! హాయిగా సినిమాలకూ, షికార్లకూ వెళ్లాలన్నా.. ఆనందంగా గడపాలన్నానూ. ఏమంటారు? ఈనాటి నుండైనా మీరు పూర్తిగా మారిపోవాలండీ! మీరు చాలా మంచివారు. కాదనను. కాబట్టే కదా మా స్థితిగతులన్నీ తెలిసి కూడా నన్ను ఆదర్శవివాహం చేసుకున్నారు. అత్తమామలను సైతం అమ్మానాన్నల కంటే ఎక్కువగా ఆదరించారు. నేను కోరుకున్నదల్లా ఒక్కటే పట్టుచీరలు కావాలనో..ఏ నగా నట్రా కావాలనో నేను కోరుకోవడం లేదండీ. ఆ ఆఫీసు టైం పోను మిగతా సమయాన్ని నా కోసం.. ఇంటి కోసం.. స్పెండ్ చెయ్యొచ్చుగా. ప్లీజ్! నా మాట కాదనరుగా!" దీనంగా వేడుకుంది శ్రీలక్ష్మి.

"సరే! ఈ రోజు సాయంత్రం ఆఫీసు అయిపోగానే ఇంటికొచ్చేస్తా. నువ్వు రెడీగా ఉంటే సరదాగా పార్కుకి వెళదాం! అట్నుంచటే ఏ హోటల్లోనో మీల్స్ చేసేసి, సెకండ్‌షో పిక్చర్ చూసొచ్చేద్దాం" అంటూ జగన్నాథం హుషారుగా చెప్పుకుపోతుంటే అవాక్కయిపోయింది శ్రీలక్ష్మి!

* * *

సాయంకాలం పార్కులో...

"సరదాగా మాట్లాడండీ"

"ఏం మాట్లాడమంటావ్!?"

"ఏదో ఒకటి మాట్లాడండీ"

మౌనం వహించాడు జగన్నాథం.

"మీరిలా ప్రశాంతంగా నా చెంతన కూర్చున్నారంటే నాకెంతో ఆశ్చర్యంగానూ.. ఆనందంగానూ ఉందండీ!"

"అమూల్యమైన సమయం కాస్తా వృథా అయిపో

వడం లేదూ?"

"నాకలా అన్పించడం లేదే!"

"నాకెందుకో అలాగే అన్పిస్తుంది"

"ఏమిటండీ? నిరాశా నిస్పృహలతో మాట్లాడుతున్నారు! చెప్పండి. ప్లీజ్ చెప్పండి. మీరేదో చెప్పాలనుకుంటున్నారు. అంతలోనే ఏదో దాస్తున్నారు. మీ మాటకు నేనెన్నడూ అడ్డు రాను. మంచికి మారుపేరైన మీరు నాకు భర్తగా లభించడమే నా అదృష్టం. మీ భావాలతో నేను తప్పకుండా ఏకీభవిస్తాను. అదేమిటో కాస్త చెప్పండి ప్లీజ్. చెప్పకుంటే నామీద ఒట్టే" అంటూ శ్రీలక్ష్మి భర్త కుడిచేతిని తీసి తన తలపై పెట్టుకుంది.

"చూడు లక్ష్మీ! అనాథగా శరణాలయంలో పెరిగిన నాకు ఆ శరణాలయంపైనా ఆ అనాథ పిల్లలపైనా మమకారం చావలేదు. ఈ జగన్నాథం బాబాయే వాళ్లకు అమ్మయినా నాన్నయినానూ! వాళ్ల పోషణకుగాను ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది నిజమే. అయినా మాకంటూ ఎవరూ లేరన్న నిర్లిప్తత ఆ పసిహృదయాల్లో చోటుచేస్కో కూడదు. సొంత రక్తంలో పరాయితనం చూసే మహానుభావుల రాక్షసత్వం వాళ్లకు తెలీదు. ఈ జగన్నాథం బాబాయి పంచిచ్చే ప్రేమామృతం తప్ప!

అలాగే రోగాలతో బాధపడే వాళ్లూ ఎంతోమందున్నారు ఈ లోకంలో. అలాంటి వాళ్లకు ప్రప్రథమంగా కావాల్సింది డబ్బే..కాదనను. అయినా ఓ మంచి మాటా... చల్లని చూపూ కరువై ఏ ఆలంబనా లేనివాళ్లూ... జీవచ్ఛవాలుగా మిగిలిన మేమింక బ్రతికినా చచ్చినా ఒక్కటే అనుకుని తమ భావిజీవితాలను అసహ్యించుకుంటూ అనాథవృద్ధ రోగులూ.. భయంకర వ్యాధిపీడితులూ లోలోన ఎంతగానో కుమిలికుమిలి ఏడుస్తూంటే, పల్కరింపే వాళ్లకో ఆలంబన అవుతుందనే సద్భావనతో కొన్ని ఘడియలైనా అలాంటి వాళ్లతో కులాసాగా కబుర్లు చెబుతూ గడిపేయాలని తెగ ఆరాటపడిపోతుంటుంది నా మనసెంతగానో! అందుకే నీ అభిమతానికి భిన్నంగా నా జీవనం గమిస్తోంది. తప్పే చేస్తున్నానో ఒప్పే చేస్తున్నానో నీకు అన్యాయం జరుగుతోందని నువ్వు భావిస్తే మాత్రం నీ దిశానిర్దేశానికి భిన్నంగా ఇకపై నేనే పనీ చెయ్యను. సరేనా?" అన్నాడు జగన్నాథం లాలనగా ఓదార్పుగా.

"నా మాట కాదనరుగా! అయితే వినండి. సహధర్మచారిణిగా మీ ఇష్టాయిష్టాలను నేనేనాడూ కాదనను సరి కదా సంపూర్ణ సహాయ సహకారాలనందిస్తా! మ..రై..తే.."

"చెప్పు లక్ష్మి.. చెప్పు..!" ఆశ్చర్యానందాలను కలబోస్తూ ఎంతో ఆత్రంగా అడిగాడు జగన్నాథం.

"మరేం లేదండీ! మీతోబాటే నేను కూడా రోజూ హాస్పిటళ్లకూ అనాథ శరణాలయానికీ తోడుగా వస్తుంటానండీ..ప్లీజ్! కాదనరుగా?"

"నిజంగా నువ్వు నా జీవనజ్యోతివి శ్రీలక్ష్మి" అంటూ గాఢాలింగనం చేస్కుంటూ జగన్నాథం ఆనందభాష్పాలను జలజలా రాల్చేశాడు.

**-కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం**
**(జగిత్యాల)**

# ఉడతాభక్తి

గౌరి పనికిరాకపోతే కబురైనా పంపేది. ఈసారి పది రోజులవుతున్నా, మనిషి జాడ లేదు. ఎవరితోనూ కబురంపలేదు. ఇంటికి మనిషిని పంపాను. తాళం వేసుందని బదులొచ్చింది.

"పది రోజులవుతున్నా రాని ఆ గౌరి కోసం ఎదురు చూస్తూ, ఇంటి పనంతా ఒక్క దానివే చేస్తూ మూలపడే కంటే ఇంకొహళ్లని కుదుర్చుకో" భర్త ఉచిత సలహా చెప్పి ఆఫీసుకి వెళ్లాడు.

'ఐదేళ్ల బట్టీ నమ్మకంగా, నమ్రతగా ఇంట్లో పన్జేస్తున్న గౌరిని కాదని వేరే మనిషిని ఏర్పాటు చేసుకోవడానికి మనసంగీకరించడం లేదు. ఏదో బలమైన కారణం ఉండి ఉంటుంది' అనుకున్నాను.

మరో రెండ్రోజుల తర్వాత... ఇంటి ముందు ఏవో మాటలు వినిపిస్తుంటే బయటికొచ్చాను.

గుమ్మంలో గౌరి నిలబడుంది.

"అమ్మ అలుసు చూసుకుని చెప్పాపెట్టకుండా పని మానేస్తే, మాకింకో పనిమనిషి దొరకదనుకుంటున్నావా?" నా పెద్ద కూతురు గౌరిని నిలదీస్తోంది.

"లోపలికి రానీయండమ్మా! ఏం జరిగిందో చెప్తాను" అని గౌరి ప్రాధేయపడుతోంది.

"పోయిన్నెల నీకిచ్చిన దానికీ, నువ్వు చేసిం దానికీ సరిపోయింది. వచ్చిన దారినే వెళ్లు. మేం వేరే పనిమనిషిని చూస్తున్నాం" అని నా రెండో కూతురు రెచ్చిపోతోంది.

గౌరి నావైపు ప్రాధేయపడుతున్నట్టు చూసి- "అమ్మా! మీరైనా నేన్చెప్పేది వినండమ్మా" అంది.

నా చిన్న కూతురు మళ్లీ కల్పించుకుని గౌరిని ఏదో అనబోతుంటే "మీ కాలేజీలకి టైమవుతుంది, వెళ్లి త్వరగా తయారవ్వండి" అన్నాను. నా కోపం తెలిసిన మా అమ్మాయిలిద్దరూ లోపలికెళ్లారు.

"ఏమైందే నీకు.. కనీసం మాటైనా చెప్పకుండా ఎక్కడికెళ్లావు? ఇంట్లో ఫంక్షనుందని తెల్సుగదా! కనీసం ఇంకొహళ్లని ఏర్పాటు చేసి వెళ్లొచ్చుగదా! తెరిపి లేకుండా కురుస్తున్న ఈ వర్షాల్లో ఎంత ఇబ్బంది పడ్డామో ఆ భగవంతుడికే ఎరుక" అన్నాను.



"అమ్మా! నాది తప్పే! నేను చెప్పేది మీరైనా వినండి. ఆ తర్వాత మీరు రావొద్దంటే అలాగే వెళ్లిపోతాను".

"ఏంటో చెప్పు" అన్నాను కోపంగా.

"ఈ వానలకి మా ఊరి పక్కనున్న రామాపురం చెరువు కట్ట తెగిపోయి ఊరంతా కొట్టుకుపోయింది. మావోళ్ల గుడిసెలన్నీ నేలమట్టమయ్యాయి. మావోళ్లంతా అనాథల్లా పిల్లాజెల్లాతో తలదాచుకునే చోటులేక చెట్టు పుట్టలపాలయ్యారు. ఎంతో మంది ఎన్నో రకాలుగా వాళ్లని ఆదుకుంటున్నారు. మా పనోళ్ల సంఘంలో మనిషికి 500 రూపాయలు వసూలు చేసి, రామాపురంలో ఇవ్వాలని నిర్ణయించారు."

"అందుకని.."

"అమ్మగారూ! మీకు తెలీన్దేముంది, నాకొచ్చే దాంట్లో ఇద్దరు పిల్లల్ని, అత్తమామల్ని సాకటమే కష్టమవుతోంది. ఐదొందలు ఇయ్యలేని నాలాంటోళ్లం పదిమంది కలిసి, రామాపురంలో వాళ్లకి కొత్తగా కట్టే ఇళ్ల దగ్గర, డబ్బు తీసుకోకుండా ఇటుకలు, సిమెంటు మోసే పని చేసొచ్చాం. అందుకే ఈ పదిరోజులూ పనికిరాలేదు. ఈ పది రోజులు జీతం నాకు తగ్గించి ఇవ్వండమ్మా"

గౌరి మాటలు విన్నాక నా ముందు ఆమె ఎంతో ఎత్తులో ఉన్నట్టన్పించింది.

"ఆ పని చేసి నీ ముందు నా పెద్దరికాన్ని చిన్నబరుచుకోలేను గానీ వచ్చి పన్లో చేరు" అన్నాను.

ఆరోజు రాత్రి..

"అమ్మా! త్వరగా రా! గౌరి టీవీలో కన్పిస్తోంది" పెద్ద కూతురు అరిచినట్టు పిలిచింది.

టీవీ న్యూస్‌లో వరదబాధితులకు పునరావాసం కల్పిస్తూ నిర్మిస్తున్న గృహనిర్మాణంలో స్వచ్ఛంధ సేవలందిస్తున్న మహిళలు అంటూ... చూపుతున్న క్లిప్పింగ్స్‌లో ఇటుకలు మోస్తూ కనిపించిన గౌరిని చూసి.. ఆమె ఉడతాభక్తికి మనసులోనే పులకించిపోయాను.

**-ఎం.వెంకటేశ్వరరావు(సికిందరాబాద్)**